


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల
సోమవారం 1 జూలై 2024 9 పేజీలు




# రుణ "మాఫీ" అయ్యేది ఎవరికో..!!



- ఒక కుటుంబానికి రెండు లక్షల వరకు పరిమితి
- విధి విధానాలు రూపకల్పన...
- చిన్నసన్నకారు రైతులే అధికం

సూర్య కరీంనగర్ ప్రతినిధి
బోనాల వెంకటేశ్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఏక కాలంలో రెండు లక్షల వరకు రుణ మాఫీ చేస్తా మని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత చేయాల్సిన రుణ మాఫీ వివిధ కారణాల వలన ఆలస్యం అయ్యింది. ఇటీవలి పార్లమెంటు ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15వ తేదీ లోగా రైతుల రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగా ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తుంది. ఒక కుటుంబంలో గరిష్ఠంగా రెండు లక్షల వరకు మాత్రమే రుణ మాఫీ చేస్తారని తెలుస్తుంది. రేషన్ కార్డు ఆధారంగా కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుని అందులో వున్న సభ్యుల మొత్తం రుణం రెండు లక్షలకు ఎక్కువ ఉన్నాకూడా... కేవలం రెండు లక్షలు మాత్రమే మాఫీ చేస్తారని తెలుస్తుంది. బ్యాంక్‌లో రుణాలు తీసుకున్న వారిలో ఎక్కవగా సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. మరో వైపు కేవలం పట్టా పాస్ పుస్తకాల ద్వారా తీసుకున్న లోన్‌లకే రుణ మాఫీ వర్తిస్తుందని... బంగారంపై తీసుకున్న రుణాలకు వర్తించదని తెలుస్తుంది. ఒకేసారి మొత్తం రుణ మాఫీ చేస్తామని ప్రకటించడంతో... ప్రభుత్వం సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తుంది. దీనికి సంబందించిన విధి విధానాలు రూపకల్పన చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించే మార్గదర్శకాల ప్రకారం ఏ మేరకు రుణమాఫీ జరుగుతుందో అని రైతులు ఎదురు చూస్తున్నారు.



# బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది



- బీజేపీ ఎమ్మెల్యేలకు నిధులివ్వకపోవడం దుర్మార్గం
- కేంద్రం కూడా అట్లనే చేస్తే ఏమవుతుందో ఆలోచించండి
- పార్టీ ఫిరాయింపుల్లో బీఆర్ఎస్ కు, కాంగ్రెస్ కు తేడా లేదు
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

సూర్య కరీంనగర్ ప్రతినిధి

పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపులు, నిధుల కేటాయింపు, సింగరేణి ప్రైవేటీకరణ దుష్ప్రచారంసహా అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.ఆదివారం కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ నిధులు కేటాయింపు, అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో బీజేపీ ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు సైతం ప్రజలు ఓట్లేస్తేనే గెలిచారనే సంగతిని గుర్తుంచు కోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే పరిస్థితి ఎట్లుంటుందో ఆలోచించాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని, అందులో భాగంగా రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు మ వద్దకు వస్తే పూర్తిగా సహకరిస్తున్నామని తెలిపారు. టీ 20 ప్రపంచ కప్ లో భారత్ విజయం సాధించడం


(మిగతా 2లో)










# నా వెంచర్ .. నా ఇష్టం...

- నిబంధనలకు విరుద్ధంగా వెంచర్
- దేవాలయ స్థలాన్ని వెంచర్ స్థలముగా చూపిన వైనం
- చూసి చూడనట్లు అనుమతులు ఇచ్చిన అధికారులు

సూర్య -కోరుట్ల


2లో..







# బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోంది

(మొదటి పేజి తరువాయి)

సంతోషం. 140 కోట్ల మంది ఆనందంతో ఉన్నారు. భారత్ గెలవాలని ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా కోరుకున్నరు. ఈ దేశమ్మీద భక్తిభావం ఉన్న వారంతా టీవీల్లో వీక్షించారు. ప్రతి భారతీయుడు తానే గెలిచినట్లుగా సంతోషపడుతున్నడు. ఇంత గొప్ప విజయాన్ని అందించిన భారత టీంకు శుభాకాంక్షలు. గతంలో రెండుసార్లు ప్రపంచకప్ గెలిచిన స్మృతులను గుర్తు చేసుకుంటున్నారు అని అన్నారు. బీఆర్ఎస్ కు, కాంగ్రెస్ కు తేడా లేదు. రెండు పార్టీలు ఫిరాయింపులకు పాల్పడుతున్నయ్. గతంలో బీఆర్ఎస్ చేస్తే... ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోంది ఇది సిగ్గు చేటు అని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు నిధులకు కేటాయింపులో తీవ్ర వివక్ష చూపుతూ దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే అభివృద్ధి నిధులిస్తోంది. బీజేపీ ఎమ్మెల్యేలకు నిధులివ్వడం లేదు. బీజేపీ గెలిచిన చోట్ల ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులకు నియోజకవర్గ ఇంఛార్జీలుగా పెట్టి నిధులిస్తోంది... ఇది సరికాదు...ప్రజలిచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉంది. నిధులివ్వకుంటే ఇతర పార్టీల ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరతారనే భావనతో వ్యవహరిస్తోంది. కేంద్రంలో బీజేపీ ఉంది. మేం కూడా అట్లనే చేస్తే మీ పరిస్థితి ఏమిటి? తెలంగాణ పరిస్థితి ఏమిటి ఒక్కసారి ఆలోచించండి అని అన్నారు.మేం పార్టీలకు అతీతంగా గెలిచిన ఎంపీలకు నిధులిస్తున్నాం. అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తున్నాం. మేం కూడా మీలాగే వ్యవహరిస్తే తెలంగాణకు నష్టం జరుగుతుంది. ప్రజలు నష్టపోతారు. అందుకే మాకు ఆ ఆలోచన లేదు. రాష్ట్ర మంత్రులు కేంద్రాన్ని కలిస్తే పూర్తిగా సహకరిస్తున్నాం. నిధులిస్తున్నాం. మా మంచి తనాన్ని పిరికితనంగా భావిస్తే మీకే నష్టం అని అన్నారు.సింగరేణి ప్రైవేటీకరణపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ ఇట్లనే దుష్ప్రచారం చేస్తే ప్రజలు బుద్ది చెప్పారు. నాడు బీఆర్ఎస్ చేసిన తప్పునే కాంగ్రెస్ చేస్తోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని అన్నారు.పవన్ కళ్యాణ్ తన ప్రతిపాదనను బీజేపీ ముందుంచారు. దీనిపై జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులుసహా పార్టీ నాయకత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందే తప్ప బండి సంజయ్ చెబితేనో ఇంకొకరు చెబితేనో పొత్తపై నిర్ణయం తీసుకునే పార్టీ బీజేపీ కాదు అని అన్నారు.

# నా వెంచర్ ..నా ఇష్టం...

**సూర్య -కోరుట్ల**

నా వెంచర్..నా ఇష్టం... అన్న రీతిలో ఏర్పాటుచేసి నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండికోటుతున్న ఓ వెంచర్ నిర్వాహకుని బాగోతం బయటపడింది. వివరాలు కి వెళితే... జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని సాయిబాబా దేవాలయం వెనకాల, కోరుట్ల జగిత్యాల జాతీయ రహదారి పక్కన రా ..డ్డి.. వెంచర్ గతంలో ప్రారంభించారు. ఈ వెంచర్ నిర్వాహకుడు రా..డ్డి... ప్రభుత్వ ఉద్యోగి రావడం విశేషం .పట్టణ శివారులోని సర్వేనెంబర్ 531,532 భూముల లతోపాటు 744 లో కొంత భూమిని కొనుగోలు చేసి వెంచర్ ను ఏర్పాటు చేశారు.ఆ వెంచర్ ను ఏర్పాటు చేసే సమయంలో ప్రభుత్వ నిబంధనలను పాటించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. నూతనంగా వెంచర్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని మౌలిక వసతులు ఆ వెంచర్ నిర్వాహకులు ఏర్పాటు చేయాలి. కానీ అందుకు భిన్నంగా వెంచర్ను ఏర్పాటు చేసి ఆరు ప్లాట్లు ..60 లక్షల...చందనంగా దండుకున్నారు. ఆ వెంచర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లను ఏర్పాటు చేయవలసి ఉండగా ఒక ప్రధాన రోడ్డు ఏర్పాటు చేసి మిగతా రోడ్లన్నీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు



చేశారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం నూతనంగా ఏర్పాటు చేసే వెంచర్ లో ఆట స్థలము, కమ్యూనిటీ హాల్, వాహనాల పార్కింగ్, దేవాలయాల నిర్మాణం కు స్థలాలను వదిలిపెట్టాలి. కానీ అలాంటిది ఏదీ చేయకుండా మున్సిపాలిటీ కి కొంత స్థలాన్ని ఇచ్చారు. ఆ స్థలం కూడా వాగును అనుకొని ఉంది .ఆ స్థలంలో గతంలో హరితహారం కింద మున్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ వెంచర్ లో ఓ ప్రాంతంలో బహుళ అంతస్తు నిర్మాణాలను కూడా చేశారు. ఆ నిర్మాణాలలో నాణ్యత లేదని ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ ప్రక్కన పెట్టి అసలు విషయం ఏమిటంటే... ఈ వెంచర్ కు ప్రభుత్వం ఏ విధంగా అనుమతి ఇచ్చిందో తెలియదు కానీ ,ఈ వెంచర్ ప్రక్కన అతి పురాతనమైన నాగులమ్మ దేవాలయం కలదు. ఈ దేవాలయ స్థలంలోని గత కొన్ని సంవత్సరాల క్రితం ఓ దేవాలయాన్ని ఓ దాత నిర్మించాడని ప్రజలందరికీ తెలుసు. ఈ దేవాలయంలో ప్రతిరోజు పూజలతో పాటు ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలు, జాతర, అన్నదాన కార్యక్రమాలు జరుగుతూ ఉంటాయి. ఇలాంటి అతి పురాతనమైన దేవాలయాన్ని ఈ వెంచర్ స్థలంగా చూపిస్తూ దేవాలయానికో ,ఇతర అవసరాల కోసము ఆ దేవాలయ స్థలాన్ని ఈ వెంచర్ లో వారి స్థలంగా వదిలిపెట్టినట్లు సమాచారం. ఇది ఇలా ఉండగా ఈ దేవాలయము ఏ వ్యక్తి పట్టా భూమి భూమి కాదు. ఇది కోరుట్ల- గుమ్లాపూర్ హాది రస్తా. ఈ స్థలంలోనే వందలాది సంవత్సరాల క్రితం ఓ బండరాయిపై నాగదేవత ప్రతిమ ఉందని అప్పటి వారందరికీ తెలుసు. ఈ స్థలంలోనే ఓ దాత నిర్మించిన ఓ దేవాలయాన్ని ఈ వెంచర్ స్థలంగా చూపి సుమారు రూ అరకోటి వరకు స్థలాన్ని ఆ రా..డ్డి... వెనకేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఇది ఇలా ఉండగా ఈ అక్రమ ప్రభుత్వ నిబంధనలు పాటించని వెంచర్ పై బిజెపి రాష్ట్ర నాయకుడు రుద్ర శ్రీనివాస్ ఇప్పటికే ఫిర్యాదు చేశాడు .ఈ వెంచర్ నిర్వాహకుడు ఇదే కాకుండా మండలంలోని పట్టణానికి సమీపంలో ఉన్న ఓ గ్రామంలో కూడా వెంచర్ ఏర్పాటుచేసి ఇండ్ల నిర్మాణం చేశాడు. ఆ వెంచర్ స్థలం నుండి గుట్టల ప్రాంతం నుండి వచ్చే నీరు వెళ్లే ఒరే ను కూడా ఆ స్థలంలో కలుపుకొని కబ్జా చేసినట్లు అప్పట్లో విమర్శలు వినిపించాయి. ఏది ఏమైనా జాతీయ రహదారిని అనుకొని అన్ని శాఖల అధికారులకు కనిపించే విధంగా వెంచర్ ఉన్న ఆ వెంచర్ వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలు అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన ఈ వెంచర్ పై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ నిబంధన ప్రకారం వెంచర్ ఉండేలా చూడాలని. అదేవిధంగా హాదిరస్తాను వెంచర్ స్థలంగా చూపించి స్థలాన్ని కబ్జా చేసిన నిర్వాహకునిపై చర్యలు తీసుకొని హాదిరస్తాకు హద్దులు ఏర్పాటు చేసి రాబోయే కాలం ప్రజలకు పాత ఆనవాళ్లు గుర్తుండే విధంగా చూడాలని ప్రజలు మున్సిపల్, రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సూర్య,రాయికల్**

రాయికల్ పట్టణ కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా రాయికల్ పట్టణ కేంద్రంలోని ఆర్.ఆర్ కన్వెన్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగభుషణం,ఆనందరావు,బుచ్చిరెడ్డి,నరేందర్ రెడ్డి, శ్రీనివాసా చారి,విద్యాసాగర్,జనార్దన్, రాఘవులు,రాజేంద్ర ప్రసాద్, వెంక టేశ్వర్ రావులను వేదికపైకి ఆహ్వానించి,పాదాభివందనం చేసి పూలమాలతో,శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం తమతో పాటు చదువుకొని మృతి చెందిన తమ మిత్రులకు ఘనంగా నివాళి అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని,ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిం చుకు న్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు కడకుంట్ల జగదీశ్వర్, ఇందూరి గంగాధర్, బోగ రాము,వాసం దిలీప్, తాటిపాముల శేఖర్,సురతాని భాగ్య లక్ష్మి, వాసాల శ్రీధర్,విరబత్తిని లక్ష్మణ్,పడాల తిరుపతి,పారిపెల్లి శ్రావణ్, పవన్ కుమార్, తీగుల్ల రాంరెడ్డి,సుధాకర్, నరేందర్ రెడ్డి,విజయలక్ష్మి పాల్గొన్నారు.



# స్మార్ట్ సిటీ మిషన్ దేశవ్యాప్తంగా పొడిగింపు

- కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాల అభివృద్ధికి మహార్ధశ
- బీఆర్ఎస్ సర్కార్ కాంట్రాక్టర్ వద్ద కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారు
- కాంగ్రెస్ లోనూ కొందరు ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారు
- తక్షణమే స్మార్ట్ సిటీ నిధుల అవకతవకలు, కమీషన్ల భాగోతంపై విచారణ జరపాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీ మిషన్ ను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కి ధన్యవాదాలు తెలుపుతూ... కేంద్ర నిర్ణయంవల్ల కరీంనగర్, వరంగల్ పట్టణాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి అయ్యే అవకాశాలు మెరుగయ్యాయి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.ఇందులో భాగంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలుపుతూ స్మార్ట్ సిటీ నిధులను విడుదల చేయాలని గతంలో నేను మూడు సార్లు లేఖ రాశాను. కరోనా వల్ల రెండేళ్ల కాలం వృధా కావడంతో స్మార్ట్ సిటీ మిషన్ ను పొడిగించాలని కోరాం. బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా వచ్చిన విజప్తులపట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వచ్చే మార్చి నెలాఖరు వరకు స్మార్ట్ సిటీ మిషన్ ను పొడిగించినందుకు సంతోషంగా ఉంది అని అన్నారు.కేంద్ర నిర్ణయంతో కరీంనగర్, వరంగల్ పట్టణాలకు మహర్ధశ రానుంది. పూర్తిస్థాయిలో అబివృద్ధి చెందే అవకాశాలు మెరుగయ్యాయి. అయితే కేంద్ర నిధులు దారి మళ్లించకుండా చూడటంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మ్యాచింగ్ గ్రాంట్ నిధులను సకాలంలో మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్ నిధులను దారి మళ్లించింది. కేంద్రం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించి సత్వర పనులు పూర్తి చేసినట్లయితే కరీంనగర్, వరంగల్ పట్టణాలు ఇప్పటికే అద్దంలా మెరిసేవి. కానీ రాష్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయకపోవడంతోపాటు కేంద్ర నిధులను కూడా దారి మళ్లించింది. నేను పార్లమెంట్ స్టాండింగ్ కౌన్సిల్ లో నిలదీసిన తరువాత కేంద్ర నిధులను జమ చేశారని అన్నారు.గత పాలకులు కమీషన్లకు కక్కుర్తి పడటంవల్లే స్మార్ట్ సిటీ పనుల్లో జాప్యం జరిగింది. కాంట్రాక్టర్ నుండి కమీషన్లు దొబ్బడం కొందరు పాలకులకు ఆనవాయితీగా మారింది. కాంగ్రెస్ పార్టీలో కొందరు నేతలు మళ్లీ కమీషన్ల కోసం అవతారమెత్తారు. తక్షణమే స్మార్ట్ సిటీ నిధుల అవతవకలు, కమీషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి అని అన్నారు

## మన్ కీ బాత్ కార్యక్రమం వీక్షించిన బిజెపి నాయకులు

**సూర్య ఇల్లందకుంట**



ఇల్లందకుంట మండల కేంద్రంలో ఆదివారం మొక్కలు నాటిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ మన్ కి బాత్ ప్రోగ్రాంను నల్లా దేవేందర్ రెడ్డి గృహంలో కార్యకర్తలతో కలిసి వీక్షించడం జరిగిందని మండల బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కంకణాల రవీందర్ రెడ్డి, శక్తి కేంద్ర ఇన్చార్జి తాడిగొప్పుల రమేష్ , బూత్ అధ్యక్షుడు చదువు సాయి రెడ్డి , మాజీ సర్పంచ్ రమణాచారి, నల్లా దేవేందర్ రెడ్డి, ఒడ్డుల దేవేందర్, ఓదెలు, శ్రీకాంత్, వికాస్ పాల్గొన్నారు.

## చందుర్తి లో క్రికెట్ అభిమానుల సంబరాలు

**సూర్య చందుర్తి**

20 20 వరల్డ్ కప్ లో భారత్ ఫైనల్ లో ఘనవిజయాన్ని సాధించిన సందర్భంగా చందుర్తి మండల కేంద్రంలో స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ అభిమానులసంబరాలు అంబరాన్నంటాయి. చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం ప్రధాన బస్టాండ్ కూడలి వద్ద నుండి జాతీయ జెండాలతో జయహెూ భారత్ జయహెూ టీమ్ ఇండియా అంటూ యువకులు క్రీడాకారులుగ్రామంలో ర్యాలీ నిర్వహించి దేశ భక్తి చాటుకున్నారు.బస్టాండ్ చౌరస్తాలో టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజీమ్ మాట్లాడుతూవిదేశీ గడ్డపై విశ్వవిజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు ఎండీ జాకీర్ వెంకీ యాకుబ్ కైర తిరుపతి లింగం పిట్టల బాబు యువకులు హరిబాబు రాంబాబు సిరికొండ తిరుపతి సిరి క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.





సూర్య

www.suryaa.com

జగిత్యాల

సోమవారం 1 జూలై 2024



# బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

### మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా సభ్యత్వం ఉన్న చిర్ర బాణయ్య గత కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బీఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా రెండు లక్షల రూపాయల చెక్కును ఆదివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగ మాజీ ఎమ్మెల్యే సుకే రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలాగా



కాపాడుకుంటుంది అని అన్నారు. కార్యకర్తల కష్టాలను పంచుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు పునుగోటి కృష్ణారావు, బారాస పార్టీ మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, సాగి మహిపాల్ రావు, తిరుమలాపూర్ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, మాజీ సర్పంచ్ ఎగుర్ల తిరుపతి, కొడిమ్యాల పట్టణ పార్టీ అధ్యక్షులు కొత్తూరి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి చెన్నమనేని వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షులు రోడ్డ శరత్, పర్లపల్లి ప్రభుదాస్, మండల యువజన అధ్యక్షులు గడ్డం లక్ష్మరెడ్డి, నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షులు సల్మాన్, ఆకునూరి మల్లయ్య, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మత్తులకు నోచుకోని తరగతి గదులు

**సూర్య మల్లాపూర్**



ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పి స్తున్నామని ప్రభుత్వం చెప్పుకొ స్తుంది కాని అందుకు భిన్నంగా మండలం లోని రేగుంట గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్న త పాం శాల నిలిచింది. తరగతి గదులు కనీస మరమ్మత్తులకు నోచుకోక విద్యా ర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆఫీస్ గదితో పాటు తరగతి గదులకు కిటికీలు సరిగా లేకపోవడంతో వర్షం కురిస్తే విద్యార్థులు తరగతి గదిలోనే తడిచే పరిస్థితి ఏర్పడింది. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ని వివరణ కోరగా.. మన ఊరి మన బడి కార్యక్రమంలో చేయాల్సిన మైనర్ రిపేర్లు సంబంధిత బిల్లులు పడకపోవడంతో చేపట్టలేదని తెలిపారు. కాగా మన ఊరి మన బడి కార్యక్రమం లేకపోతే ఏలా మరమ్మత్తులు చేసే వారు.. అకాడమీక్ ఇయర్ మొదలై తరగతులు నిర్వహిస్తున్నప్పటికి ఎందుకు చేయలేదనేది ప్రశ్నార్థకంగా మారింది. సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మరమ్మత్తులు చేయించి సమస్య పరిష్కారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# నేడు జగిత్యాలకు కేటీఆర్

### -ప్రతి కార్యకర్త పాల్గొనాలి - పులి వెంకటేష్ గౌడ్

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశ కార్యక్రమం సోమవారం రోజున పద్మనాయక కళ్యాణమండపం, జగిత్యాల లో ఉదయం 10 గంటలకు జగిత్యాల జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగుతుంది దీనికి ముఖ్య అతిథు లుగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరయి కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కొడిమ్యాల మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్ పత్రిక ప్రకటనలో తెలిపారు.

## ఏఎంసి చైర్మన్ యాదవులకు కేటాయించాలి

**సూర్య కోరుట్ల రూరల్**



కోరుట్ల మండల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని జనరల్ కోట కింద యాదవ వర్గానికి ఇవ్వాలని కోరుట్ల మండల బీసీ సెల్ కాంగ్రెస్ అధ్యక్షులు యూసుఫ్ నగర్ కు చెందిన ముక్కల లింబాద్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ విజయం కోసం బీసీ అణగారిన వర్గానికి చెందిన కార్యకర్తలు శ్రమించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందున సముచిత స్థానం కల్పిస్తారని ఆశిస్తూ బీసీ వర్గానికి చెందిన యాదవులకే ఏఎంసి చైర్మన్ పదవి కేటాయిస్తే కష్టానికి ఫలితం దక్కినట్టు అవుతుందని ఆయన అన్నారు.

# నేడు జగిత్యాలకు రానున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్

**సూర్య జగిత్యాల**



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ సోమవారం జగిత్యాల జిల్లాకు రానున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు తెలిపారు..కేటీఆర్ పర్యటనపై జగిత్యాల భారాస జిల్లా కార్యా లయంలో కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ, జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన బిఆర్ఎస్ లీడర్లు, కార్యకర్తలతో కేటీఆర్ సమావేశం కానున్నారని అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో భవిష్యత్ కార్యాచరణ పై కేటీర్ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారని వివరించారు. కేటీఆర్ పర్యటనలో పెద్ద ఎత్తున శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇటీవలే బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ జగిత్యాల పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

# లయన్స్ క్లబ్ సేవలు విస్తరించాలి.

### ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్..

**సూర్య మెట్‌పల్లి**

లయన్స్ క్లబ్ ద్వారా సేవలు చేయడం అభినందనీయం అని సేవలు మరింతగా విస్తరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఆదివారం ఓ పంక్షన్ హాల్ లో నిర్వహించిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. అంతకుముందు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం తో సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ లయాన్ మోర బద్రేశం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు ఇల్లెందుల ఐలపురం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుండా రాకేష్, క్యాసియర్ నాంపల్లి వేణు గోపాల్, జోన్ చైర్మన్ గడ్డం శంకర్ రెడ్డి, చర్లపల్లి రాజేశ్వర్ గౌడ్, దొంతుల రాజ్ కుమార్, ముద్దం రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘ అధ్యక్షులుగా మ్యాకల వెంకటేశం

**సూర్య కోరుట్ల రూరల్**



మండలంలోని వెంకటాపూర్ గ్రామ పద్మశాలి సంఘ అధ్యక్షులుగా మ్యాకల వెంకటేశం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. వెంకటాపూర్ పద్మశాలి సంఘ సమావేశం లో నూతన కార్యవర్గం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా మ్యాకల వెంకటేశం, ఉపాధ్యక్షులు ద్యావనపల్లి గోపి కుమార్, ప్రధాన కార్యదర్శి ఎనుగందుల రమేష్, కోశాధికారి అనుమల్ల నాగయ్య ఉప కోశాధికారి బండ్ల సతీష్ , సహాయ కార్యదర్శి బండ్ల లక్ష్మినారాయణ, లతో పాటు సలహాదారులు సిరిపురం గంగారాం, మ్యాకల నర్సయ్య, సంకు నరేందర్ లకు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు

## గానకోకిల కళానికేతన్ అధ్యక్షులుగా రవికుమార్

**సూర్య జగిత్యాల**



జగిత్యాల జిల్లాలో మూడు దశాబ్దాల క్రితం నెలకొల్పిన గాన కోకిల కళానికేతన్ కళా సంస్థ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎలిగేటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జగిత్యాల టౌన్ హాల్లో కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించి రెండు సంవత్సరాల కాలపరిమితి కోసం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని రాజేంద్రప్రసాద్ తెలిపారు. అధ్యక్షులుగా మాన్యం రవికుమార్, ప్రధాన కార్యదర్శి గా ఎలగందుల రవి, ఉపాధ్యక్షులుగా జంగిలి గోపి, కోశాధికారిగా తోకల రమేష్, సంయుక్త కార్యదర్శి గా కుంటాల శ్రీను, ఆర్గనైసింగ్ కార్యదర్శిగా మచ్చ రవీందర్ లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ, న్యాయ సలహాదారులుగా పుప్పాల అశోక్, గౌరవ సలహాదారులుగా మామిడిపెల్లి అర్జున్ కుమార్, ముఖ్య సలహాదారులుగా క్యాదాసు నాగయ్య, చిట్ల రవీందర్, వాసాల వెంకటేశ్వర్లు ఎన్నికయారని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఎన్నో కలా సంస్థలకు జీవం పోసి తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలను మెప్పించిన జానపద గేయాలు ఈ కళా సంస్థనుండి వెలువరించి గాన కోకిల కలనికేతన్ ప్రభంజనం సృష్టించిందని నూతన అధ్యక్షుడు మాన్యం రవికుమార్ తెలిపారు. కార్యవర్గం ఎన్నికపట్ల జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, కళాకారులు తదితరులు అభినందించారు.

# అంగన్వాడి కోడి గుడ్డులో కోడి పిల్ల

**సూర్య -కోరుట్ల**



ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహార సరఫరా లో భాగంగా పంపిణీ చేసే కోడిగుడ్డులో కోడి పిల్ల ప్రత్యక్షమైంది. ఈ ఘటన కోరుట్ల పట్టణంలో జరగగా ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఆకుల మన్విత అనే చిన్నారికి స్థానిక అంగన్వాడీ టీచర్ కోడిగుడ్లను అందజేసింది. ఆదివారం ఉదయం చిన్నారికి కోడి గుడ్డును అందించేందుకు ఉడకబెట్టే క్రమంలో ఓ గుడ్డు బరువు తక్కువగా ఉండి తేడాగా ఉన్నట్లు గమనించారు. వెంటనే గుడ్డు పై పెంకు తొలిచి చూడగా లోపల కోడి పిల్ల కదులుతూ కనిపించింది. దీంతో మన్విత తల్లి ఆశ్చర్యానికి గురైంది. అయితే ఇటీవల కాలంలో అంగన్వాడీల ద్వారా గర్భిణీలకు పిల్లలకు సరఫరా చేసే గుడ్లు తక్కువ బరువులో ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా కోరుట్లలో జరిగిన ఈ ఘటనతో కాలం చెల్లిన నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# నైపుణ్యతను వెలికితీసేందుకు క్రీడలు...

### జిల్లా అథ్లెటిక్స్ అధ్యక్షుడు మహర్షి

**సూర్య మెట్‌పల్లి**



గ్రామీణ ప్రాంతాల విద్యార్థులలో దాగివున్న నైపుణ్యతను వెలికితీ సేందుకు అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి బి మహర్షి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో అథ్లెటిక్స్ క్రీడ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీ లలో గెలుపొందిన క్రీడాకారులను 15 మందిని ఎంపిక చేసి జులై 7 వ తేదీన హైదారాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా కోశాధికారి కొమ రయ్య, ఉపాధ్యక్షులు గజల్లి రాందాస్, ఎడ్లపురం అంజయ్య, కార్తీక్, శంకర్, క్రీడా ఉపాధ్యాయులు రాజశేఖర్, భవాని, ప్రశాంత్, కొమురయ్య, శ్రీలత, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్నమాజీ ఎమ్మెల్యే

**సూర్య మల్యాల**



చొప్పదండి మాజీఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తన జన్మదిన సంద ర్భంగా ఆదివారం ప్రముఖ పుణ్య క్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనే యుస్వామి వారిని దర్శించుకు న్నారు. వారికి ఆలయ అర్చకులు ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యంపేట మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి బి ఆర్ఎస్ మండల అధ్యక్షులు జనగం శ్రీనివాస్ బి ఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ట్రీ మ్యాన్ ఆఫ్ తెలంగాణ అవార్డు అందుకున్న సింగరేణి సి అండ్ డి

## -హైదరాబాద్ లో ప్రదానం చేసిన ప్రముఖ గ్రీన్ మ్యాపుల్ సంస్థ

## -స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటి.. 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను సృష్టించినందుకు గుర్తింపు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థను పర్యావరణ హిత సంస్థగా మార్చడమే కాకుండా అందరిలోనూ పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు తానే స్వయంగా 18 వేలకు పైగా మొక్కలు నాటి, తెలంగాణలోని 6 జిల్లాల్లో 35 చిన్న అడవులను(మినీ ఫారెస్ట్స్) సృష్టించినందుకు గుర్తింపుగా సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ కు గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ వారు "ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ "అనే ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్ -2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ కు ఈ అవార్డును అందజేశారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రభుత్వ రంగ, ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు, అందులోని ప్రభావశీల వ్యక్తులకు గ్రీన్ మ్యాపుల్ వారు ప్రతి ఏడాది ఇటువంటి ప్రోత్సాహక అవార్డులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్.బలరామ్ ఇప్పటికే స్వయంగా 18వేలకు పైగా మొక్కలు నాటారని, సింగరేణి



సంస్థ కూడా ఆరు కోట్లకు పైగా మొక్కలు నాటి పర్యావరణానికి మేలు చేస్తున్న సంస్థల్లో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ఉన్నత స్థాయిలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం ఒక్కడే 18 వేల మొక్కలు నాటి 6 జిల్లాల్లో 35 చిన్న అడవులుగా( మినీ ఫారెస్ట్ ) సృష్టించడం దేశంలోనే అత్యంత అరుదని కొనియాడారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎన్.బలరామ్ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి చేస్తున్న తమ సంస్థ నిబంధనల ప్రకారం పచ్చదనాన్ని కాపాడడంతో పాటు స్వచ్ఛందంగా కూడా పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, సింగరేణి వ్యాప్తంగా 6 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు చెప్పారు. సింగరేణి సంస్థ చేస్తున్న పర్యావరణ హిత చర్యలకు గుర్తింపుగా 2021-22వ సంవత్సరంలో కార్బన్ న్యూట్రాలిటీ కంపెనీగా సీఎం పి డిఐ గుర్తించిందని పేర్కొన్నారు. ప్రతీ అడుగు పచ్చదనం అన్న నినాదంతో సింగరేణిలో మొక్కలు నాటే యజ్ఞాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో మరో 2 వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు వివరించారు. దీంతో 20 వేల మొక్కలు నాటినట్లు అవుతుందన్నారు. కంపెనీలో ఈ ఏడాది 40 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అలాగే పిల్లల్లో చిన్నతనం నుంచే పర్యావరణ స్ఫూర్తిని పెంచేందుకు వీలుగా సింగరేణి పాఠశాలల్లో పర్యావరణ సిలబస్ను బోధిస్తున్నామని.. ప్రతీ క్లాస్ లోనూ గ్రీన్ కెప్టెన్లను నియమించి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు చెప్పారు. తనకు అవార్డును ప్రకటించిన నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపిన ఆయన ఈ అవార్డు సింగరేణిలోని పర్యావరణహితులందరికీ చెందుతు ందన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ, ఆయిల్ ఇండియా తదితర కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

## - ఆసుపత్రికి తరలించిన కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి గాయాలైన సంఘటన కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పెద్దపల్లి మండలం మారేడుగొండ గ్రామానికి చెందిన కమటం రమేష్ కాల్వ శ్రీరాంపూర్ నుంచి తిరిగి మారేడుగొండకు వెళుతుండగా గంగారం గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనము అదుపుతప్పి పడిపోయాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన స్థానికులు కాల్వ శ్రీరాంపూర్ పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై ఓంకార్ యాదవ్ క్షతగాత్రున్ని 108 వాహనం ద్వారా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాల్వ శ్రీరాంపూర్ ఎస్సై బి ఓంకార్ యాదవ్ తెలిపారు.

# ప్రత్యేక పూజలు నిర్వహించిన జడ్జి.

**సూర్య ఓదెల**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబిక మల్లికార్జున స్వామిని గోదావరిఖని జూనియర్స్ సివిల్ జడ్జి వెంకటేష్ దూర్వా ఆదివారం రోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. చైర్మన్ మేకల మల్లేశం యాదవ్, డైరెక్టర్లు ఆయన ను సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# చిన్నారుల సంబరాలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



క్రికెట్ లో ప్రపంచ విశ్వ విజేతగా ఇండియా నిలవడం పట్ల రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఆదివారం చిన్నారులు సంబరాలు జరుపు కున్నారు. అండర్-14 ఎస్.జీ.ఎఫ్ కెప్టెన్ పల్లె.సాక్షిత్ రావు ఆధ్వర్యంలో చిన్నారులు కేక్ కట్ చేసారు. టీ-20 లో ప్రపంచ ఛాంపియన్ లు గా భారత్ నిల్వడం పట్ల టపకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

# రంగంపేట గ్రామ పంచాయతీ భవన శిలఫలకం ధ్వంసం.

**సూర్య. ఇల్లంతకుంట.**

మండలంలోని రంగంపేట నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభాన్ని మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపెల్లి సత్యనారాయణ చేతులమీదుగా శనివారం ప్రారంభించారు.ఆదివారం తెల్లారేసరికి శిలఫలకం ధ్వంసం అయి కనిపించడంతో గ్రామస్థులు అధికారులకు, పోలీసులకు సమాచారాన్ని ఇవ్వగా, అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకొని పరిశీలించారు.గుర్తు తెలియని వ్యక్తులపై పిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

# కమాన్ పూర్ నూతన లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా సాన

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ నూతన లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ కు చెందిన సింగరేణి ప్రముఖ కాంట్రాక్టర్ సాన రామకృష్ణ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ 2వ ప్రతిష్టపన మహోత్సవంలో భాగంగా స్థానిక సాన రామకృష్ణ రెడ్డి గార్డెన్ లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్బంగా ఘనంగా సాంస్కృత కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్ స్టాలేషన్ ఆఫీసర్ సింహరాజు కోదండరాం, కమాన్ పూర్ నూతన లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా సాన రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్, కోశాధికారిగా డాక్టర్ పి.విజయకుమార్ లతోపాటు లయన్స్ క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయించినారు. ఈ సందర్బంగా సాన మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా కంటి ఆఫరేషన్ లు నిర్వహించడంతో పాటు షుగర్ పరీక్షలు, నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించామన్నారు. అలాగే సదాశాయ స్వచ్ఛంద సంస్థ తో కలిసి 64 మందికి కంటి చూపు కలిగించడంతో పాటు రెండు దేహాలను మెడికల్ కాలేజీలకు అందజేయడం అభినందనీయమన్నారు. సాన రామకృష్ణ రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ కు రెండోసారి అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న కాలంలో సభ్యులందరి సమన్వయంతో సేవ కార్యక్రమాలు చేపట్టి ఆదర్శ లయన్స్ క్లబ్ గా కమాన్ పూర్ ను తీర్చిదిద్దుతానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇండక్షన్ ఆఫీసర్ వేల్పూరి సంపత్ రావు, బండ బాబురావు, ఉట్ల అశోక్, గుంత వినోద్, లయన్ సభ్యులు ఇనగంటి భాస్కరరావు, కోలేటి మారుతి, బొజ్జ రాజసాగర్, చౌడవరపు లింగమూర్తి, తిమ్మరాజు శరత్ కుమార్, అనవేని లక్ష్మీరాజం, చెప్పాలా సమ్మయ్య, గుమ్మడిఅంజయ్య, నారగోని సతీష్, జబ్బార్ ఖాన్, బండ సాయి శంకర్, పొన్నం నవీన్, చొప్పరి సంపత్, తంగళ్లపల్లి రాజ్ కుమార్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ పరిధిలోని ఊషన్నపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ధరణి మణికంఠ నాయనమ్మ ధరణి అమృతమ్మ గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో చెందారు. ఆదివారము బిజెపి నాయకులు సదయ్య గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతురాలు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కూస రాజు, ముస్కు సంపత్ రెడ్డి, పెంతల రమేష్,ముస్కు శివరామ కృష్ణ, కూస రాజు,మంద రామన్న,ఎర్ర రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగా చార్య సంపత్ కుమార్ ప్రత్యేక పూజలు.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై జగత్ మహా మనేశ్వర స్వామి ఆలయంలో యోగా చార్య సంపత్ కుమార్ ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు బసవత్తుల రాజమౌళి ఆచార్యులు యోగాచార్య సంపత్ కుమార్ ను పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మాని ంచారు. ఈ సందర్భంగా రాజమౌళి ఆచార్యులు మాట్లాడుతూ యోగాచార్య సంపత్ కుమార్ యోగకు సంబంధించి 40 పుస్తకాలు రాయడం జరిగిందని, అదేవిధంగా గ్రామీణ భాష పై కూడా పుస్తకం రాయడం గొప్ప విషయం అన్నారు.యోగాతో పాటు కరాటేలో ఎంతోమంది శిష్యులను కలిగిన సంపత్ కుమార్ పి ఈ టి ఉపాధ్యాయ వృత్తిలో కూడా ఎంతోమంది క్రీడాకారులను తయారు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సంపత్ కుమార్ మా ఆలయానికి రావడం మాకెంతో ఆనందదాయకమన్నారు.

# బాధితునికి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే, సారయ్య గౌడ్

**సూర్య కాల్వ శ్రీరాంపర్**



గత వారం రోజుల క్రితం గంగారం గ్రామంలో వీచిన భారీ గాలివాన బీభత్సానికి నాయి బ్రాహ్మణుడు రాచకొండ సదయ్యకు చెందిన సెలూన్ షాపుపైన చెట్టు పడి తీవ్రంగా నష్టపోయారు. సెలూన్ షాపు మరమ్మతుల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రక్షాన పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయ రమణారావు గారి ఆదేశానుసారం కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ రూ 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా బాధితుడు సదయ్యకు అందించారు.ఈ కార్యక్రమంలో గంగారం గ్రామ శాఖ అధ్యక్షుడు నేదురు రమేష్, బాలే సమ్మయ్య, మేడి అశోక్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గుడ్ల సంపత్,చీర ఓదెలు, కాల్వ వేమారెడ్డి, రేకుల రఘు,ముస్కు మధుకర్, నోముల కిరణ్,కుందేల రవీందర్, అనుముల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సేవలో ముఖ్యమంత్రి ఓఎస్డీ

## రాజన్న గోశాల సందర్శన

**సూర్య, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ స్వామి వారిని ఆదివారం ఋఖ్యమంత్రి ఓఎస్డి వేముల శ్రీనివాస్ , ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తితో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేదోక్త ఆశీర్వచనం చేశారు. వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో గల రాజన్న గోశాలను సందర్శించి కోడెల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసు కున్నారు. గోశాలలో కోడెలకు ఇచ్చే పచ్చి గడ్డి,కాన్సైలేజ్,సోయాబీన్,పల్లిపిండి తవుడు ,ధనము,బాబ్బారా లను పరిశీలించి,అనంతరం గోశాలలోని రికార్డులు పరిశీలించారు. ముఖ్యమంత్రి ఓఎస్డి,ప్రభుత్వ విప్ తో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. సిఎం ఆదేశాలతో రాజన్న గోశాల ను సందర్శించాను.రాజన్న ఆలయానికి రాజన్న కోడెలు ఎంతో ప్రాముఖ్యమని సిఎం ప్రత్యేకం గా స్వయంగా చెప్పారని అన్నారు. ఇది వరకే



గోశాలను ఎండోమెంట్ కమీషనర్ విజిట్ చేశారని,400 ఉండాల్సిన గోశాలలో 1500 వరకు ఉన్నాయన్నారు.కొంత అనారోగ్యం కారణంగా కోడెలు మృతి చేందుతున్నాయని, బురద నీరు లేకుండా సీసీ రోడ్ నిర్మాణం, కొత్త షెడ్ల నిర్మాణం కోసం ఆదేశాలు జారీ అయ్యా యన్నారు. గోశాల ఆధునీకరణ కోసం మరిన్ని నిధులు వెచ్చిస్తున్నామని,కోడెల సంరక్షణ కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.మళ్ళీ రైతులకి ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని,రాజన్న గోశాలలో పర్మనెంట్ గా వైద్య సిబ్బందిని నియమిస్తామన్నారు.భక్తుల మనోభావాలను గౌరవించేందుకు ప్రతి చర్యలు తీసుకుంటామని తెలిపారు.అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారని,గత 5 నెలల క్రితమే రాజన్న ఆలయం,గోశాల అభివృద్ధి కొరకు రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో గతంలో వెనక్కి వెళ్లిన వి.టి.ఏ.డి.ఏ నిధులు రూ. 20 కోట్లను తిరిగి రప్పించడం జరిగిందని, మధ్యలో ఎన్నికల కోడ్ వల్ల అభివృద్ధిలో కొంత ఆలస్యం జరిగిందని అన్నారు.రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకునే భక్తులు ఆరోగ్యంగా, పాలు మరచిన, నిర్ణీత వయసు నిండిన కోడెలను మాత్రమే సమర్పించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట ఈ ఈ రాజేష్, డి ఈ లు రఘునందన్, రామేశ్వరరావు, ఏఈఓ లు హరికిషన్,జయ కుమారి, ప్రతాప నవీన్, బ్రాహ్మణగారి శ్రీనివాస్ ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు, నటరాజ్ నాగుల మహేష్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, ఈవో సిసి ఎడ్ల శివ సాయి, ఆలయ అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### శ్రీ ఆది వరహాస్వామి సన్నిధిలో

## చిన్నారుల నృత్య ప్రదర్శన

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆదివార స్వామి సన్నిధిలో ఆదివారం రోజున చిన్నారుల నృత్య ప్రదర్శన జరిగింది. ఈరోజు ప్రదర్శన శ్రీ మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ విజయవాడ వారి సౌజన్యంతో నృత్యోత్సవం నిర్వహించారు. ఈ నృత్యం కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల నుండి చిన్నారులు వచ్చి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి చిన్నారికి మువ్వ ఈ నృత్య ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి నృత్య కళాకారులకు శ్రీ మువ్వ గోపాల కల్చర్ అకాడమీ వారు మెమొంటోతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కాగా ఈ నృత్య ప్రదర్శనలో సుమారు 150 మంది చిన్నారులు పాల్గొన్నారు. అలాగే 20 మంది గురువుల ఆధ్వర్యంలో ఈ నృత్య ప్రదర్శన జరిగింది. ఈ చిన్నారుల నృత్య ప్రదర్శన ఎంతో అలరించింది. ముందుగా కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు మరియు భూపల్లి జ్యోతి మల్లేష్ బొజ్జ నరసింహ చారి కొలిపాక లక్ష్మి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు నందిరాజు అరుణ కళ్యాణి సాయి నరసింహ కృష్ణ పాల్గొని చిన్నారులకు మెమొంటోళ్లను అందజేశారు. ఉదయం నుండి రాత్రి వరకు కొనసాగింది.

## కేశవపట్నంలో ఆటో డ్రైవర్ల శ్రమదానం

**సూర్య, శంకరపట్నం**



మండలంలో ఇటీవల భారీగా కురిసిన వర్షం కారణంగా చౌరస్తా వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు గతంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన మిషన్ భగీరథ పైప్ లైన్ కాల్వ పక్కనే గుంతలు కావడ వలన వచ్చి పోయే వాహనాలకు దారులకు ఇబ్బందులు చూడలేక ఆ గుంతలను కేశవపట్నం ఆటో యూనియన్ సభ్యులు అంతా కలిసి మట్టితో గుంతలను తొలగించి శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శాశ్వతంగా మరమ్మత్తులు చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో సుంకరి కిషోర్, దొమ్మంటి వెంకటస్వామి, పరమేశ్వర్, గడ్డం శ్రీకాంత్, రషీద్, మంజు, పాల్గొన్నారు.

### సింగరేణి నిర్వాసితులకు

## సహకారం అందిస్తాం

**-ముల్కలపల్లిలో ఉచిత వైద్య శిబిరం**

**-ఆర్జీ-3 జీ.ఎం సుధాకర్ రావు**

**సూర్య, సెంటినరీ కాలనీ**




ఆర్జీ-3 పరిధి ఓసీపీ-1 ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన ముల్కలపల్లి ప్రైమరీ స్కూలులో ఆదివారం సింగరేణి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరము ఏర్పాటు చేసింది. ఓపెన్ కాస్ట్-1, ఉపరితల గని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మెడికల్ క్యాంపును ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు ప్రాంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జీఎం సుధాకర్ రావు మాట్లాడుతూ భూ నిర్వాసితులు, ప్రభావిత గ్రామాల ప్రజలకు సింగరేణి ఎప్పుడు సహకారం అందిస్తుందని అన్నారు. రెమిడీషన్ ప్లాన్ లో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఈ ప్రాంత గ్రామాలలో ఏర్పాటుచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పదకతతో పాటు ఉద్యోగుల, పరిసర గ్రామ ప్రజల సంక్షేమం కొరకు పునరాంకితం అయిందని అన్నారు. ఓసీపీ-1 రేమీడియేషన్ ప్లాన్ లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంప్ ను ప్రజలు సాధ్వినియోగం చేసుకోవాలని కోరారు ముల్కలపలి గ్రామ అభివృద్ధికి సింగరేణి సంస్థ అన్ని విధాలుగా తోడుంటుందని తెలిపారు.ఈ మెడికల్ క్యాంప్ లో కంటి, ఎముకల, చర్మ, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్, స్త్రీల కొరకు గైనకాలాజిస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొనగా, సుమారు 200 మంది గ్రామస్థులకు వైద్యం అందించి, ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమం లో ఓసీపీ-1ప్రాజెక్ట్ అధికారి నాలజలా.రాధాకృష్ణ, ఏరియా హాస్పిటల్ ఏసీఎంఓ డా: కిరణ్ రాజ్ కుమార్, ఎస్ఓటూ జీ.ఎం గుంజపడుగు రఘుపతి, ఏఐటియుసీ బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్.సీ.రెడ్డి, ఐ ఎన్ టి యు సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటా. రవీందర్ రెడ్డి , ఏరియా అధికారులు సంఘం అధ్యక్షులు సి.హెచ్.వెంకట రమణ, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, మెడికల్ సూపరిండెంట్ వర్ధినేని. కల్యాణ్ చక్రవతి తో పాటు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన గౌరవం

**- మహానంది పురస్కారాన్ని అందుకున్న మల్లేష్ యాదవ్**

**సూర్య, మల్లాపూర్**



యువతకు స్ఫూర్తిగా నిలిచి అన్ని రంగాల్లో ముందుండి సమాజ సేవా కార్యక్రమాలు చేసిన మల్లా పూర్ మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన గనవేని మల్లేష్ యాదవ్ కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. క్రీడా రంగాల్లో, సేవా కార్యక్ర మాల్లో తనదైన శైలిలో ముందున్న మల్లేష్ ను తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ గుర్తించి ఈ మేరకు మాజీ ప్రధాని భారత రత్న పీవీ నర్సింహా రావ్ జయంతి ఉత్స వాల సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్ లో నిర్వహించిన జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ వేడుకలలో గిన్నిస్ బుక్ రికార్డ్ అవార్డు గ్రహీత విశ్వకళా విరాట్ బ్రహ్మశ్రీ వంగల శాంతి కృష్ణాచార్య, హాస్య నటుడు నంద, తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పోలోజ్ రాజ్ కుమార్ ల చేతుల మీదుగా మల్లేష్ మహానంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల పలువురు జిల్లా నాయకులు, యువకులు ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన ఆర్జీ-3 జీఎం

**సూర్య, సెంటినరీ కాలనీ**



సింగరేణి సంస్థ భూ నిర్వాసితుల సంక్షేమానికి వెనకాడదని రామ గుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర.సుధాకర రావు అన్నారు.ఆదివారం కమాన్పూర్ మండలంలోని ముల్కలపల్లి గ్రామం నందు సుమారు రూ.4.50 లక్షలతో సింగరేణి సంస్థ సీ.ఎస్.ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన నీటి శుద్ధి కేంద్రం ( ఆర్వో ప్లాంట్) ను జీఎం ఎన్.సుధాకర రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ భూ నిర్వాసితుల సంక్షేమానికి వెనకాడదని, ఈ గ్రామ ప్రజల మంచినీటి సదుపాయం కోసం ఏర్పాటుచేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎం.రామచంద్ర రెడ్డి, ఐ ఎన్ టి సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. వెంకట రమణ, ప్రాజెక్ట్ అధికారి నాలజలా.రాధాకృష్ణ, ఎస్ ఓ టు జి ఎం గుంజపడుగు.రఘుపతి, పర్యావరణాధికారి పి.రాజారెడ్డి, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి లతోపాటు ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒక పంట సాగు చేస్తే రైతులకు రైతుబంధు ఇవ్వాలి

**-పోతారం సింగల్ విండో చైర్మన్ సాగర్ రావు**

**సూర్య, మల్యాల**



ఒక పంట అయిన సాగు చేసే రైతుకు రైతుబంధు ఇవ్వాలని నూకపల్లి సింగల్ విండో చైర్మన్ సాగర్ రావు అన్నారు. మల్యాల మండలం పోతారం గ్రామంలో ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతు బంధు ప్రత్యేక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగల్ విండో చైర్మన్ సాగర్ రావు మాట్లాడుతూ రెండు సంవత్సరాల్లో కనీసం ఒక్క పంట అయినా సాగు చేసి పంట పండించే రైతులకు రైతు బంధు ఇవ్వాలని అలాగే 10 ఎకరాల లోపు వ్యవసాయ భూమి కలిగి ఉండి సాగు చేసుకునే రైతులకు రైతు బంధు ఇవ్వాలని రైతు బంధు ద్వారా రైతులు తమ పెట్టుబడి సహాయం పొంది ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉంటారని అలాగే ప్రస్తుతం ప్రభుత్వం వారు అందించే రైతు బంధు కు ఇంకా కొంత కొంత మేర ఆర్థిక సహాయం జమ చేసి ఎకరానికి 10 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం రైతుకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమములో మంచిర్యాల జిల్లా సహకార అధికారి బి.రాం మోహన్, అసిస్టెంట్ రిజిస్టర్ శ్రీ మల్లేశం జూనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్ మరియు సంఘం పాలక వర్గ సభ్యులు , సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు

**- తల్లిదండ్రులదే మైనర్ల భద్రతకు బాధ్యత - వేములవాడ డిఎస్పీ : నాగేంద్రచారి**

**సూర్య,వేములవాడ టౌన్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో మైనర్ డ్రైవింగ్ 102, వితౌట్ డ్రైవింగ్ లైసెన్స్ 194, సెల్ ఫోన్ డ్రైవ్ 156, వితౌట్ నెంబర్ ప్లేట్: 241, డ్రంక్ అండ్ డ్రైవ్ 126, ఓపెన్ డ్రింకింగ్ 124 విత్ ఔట్ హెల్మెట్ 280, మొత్తం: 1223 కేసులు చేసినట్లు వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి వెల్లడించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే ఇకపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడుతాయని, వారి భద్రత తల్లిదండ్రుల బాధ్యతే అని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే ఇక నుండి నడిపిన వారితో పాటు వాహన యాజమానులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అట్లాగే డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోవడం, నెంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేయడం, సగం సగం నెంబర్ ప్లేట్లు కలిగి ఉండటం మద్యం త్రాగి వాహనాలు నడిపితే మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని డిఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు.





## రాజన్న ఆలయ ఉద్యోగుల పదవీ విరమణ

**సూర్య, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో వివిధ హెూదాలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు డి.శేఖర్ ఎలక్ట్రికల్ ఏ. ఈ,కొంటికర్ల రామయ్య శర్మ హార్మోనిస్ట్ ,బొడుసు నర్సయ్య, జూనియర్ అసిస్టెంట్, పి.శివరాజ్ జూనియర్ అసిస్టెంట్, జి.లింగయ్య స్కావెంజర్లను ఈఓ రామకృష్ణ శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంకెపల్లి హరికిషన్ ,గౌరవ అధ్యక్షులు సీరిగిరి శ్రీరాములు,కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్,ఈ.ఈ. రాజేష్,అరుణ్,సురేష్,పెంట శ్రీను,ఎడ్ల శివ, తదితరులు పాల్గొని శాలువాలతో సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు.



## పద్మశాలి సమాజ సేవా సంఘం నూతన కార్యవర్గం

**సూర్య బోయినపల్లి**

బోయినపల్లి గ్రామంలోని పద్మశాలి సమాజ సేవా సంఘం నూతన కార్యవర్గమును ఆదివారం రోజు ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు దూసరాజేశం, అధ్యక్షులు బిల్ల మల్లేశం, ఉపాధ్యక్షులు భీమనాతిని రమేష్ ,ప్రధాన కార్యదర్శి మ్యా న కరుణాకర్, కోశాధికారి వాసాల శ్రీనివాస్ ,సంయుక్త కార్యదర్శి సిరిపురం ఉపేందర్, కార్యవర్గ సభ్యులుగా వాసాల అశోక్ ,సామల రాజశేఖర్, మ్యాన రమేష్ ,స్వర్గం శ్రీశైలం, బిల్లా వెంకట నరసయ్య, మహేశుని శ్రీధర్ ,బిల్ల రమేష్, బిళ్ళ చంద్రమౌళి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## టి20 ప్రపంచ కప్ ఫైనల్లో భారత ఘన విజయం హర్షణీయం

**- ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు : ఆది శ్రీనివాస్**

**సూర్య, వేములవాడ**



టి20 క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.17 ఏళ్ల నిరీక్షణ తరువాత టీ -20 వరల్డ్ కప్ లో భారత్ విజయం పట్ల తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు.ఈ సందర్భంగా కెప్టెన్ రోహిత్ బృందానికి అభినందనలు తెలిపారు. భారత్ టి -20 ప్రపంచ కప్ గెలవడం పట్ల దేశ ప్రజలకు , క్రికెట్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం రేపటి భవిష్యత్ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని ఆకాక్షించారు.

## ఎల్ వోసి అందజేత

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్**

**సూర్య గంభీరావుపేట**

మండల కేంద్రానికి చెందిన మంగళపల్లి శిరీష అనారోగ్యంతో బాధపడుతుండగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ సిరిసిల్ల ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా మెరుగైన చికిత్స కోసం రూ.2.50 లక్షల విలువచేసే ఎల్ వోసి బాధితురాలికి అందించారు. పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు ఓరగంటి నర్సింలు, ఏడ పోయిన ప్రభాకర్, జంగం రాజు లక్కం నాంపల్లి, ఎండి యాదుల్లా, నుస్రత్, బంగ్లా రాజు గౌడ్, చందర్ గౌడ్, భాస్కర్ నాయక్ గంగి సామి, దేవానంద్, దుశెట్టి శేఖర్, కిషన్, గుడి కాడి కుమార్ మల్లయ్య లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నపేటలో ఆటో బోల్తా ...మహిళ మృతి

**- పలువురికి తీవ్రగాయాలు....**

**- ధర్మారంలో విషాదం**

**సూర్య కోనరావుపేట**



ఆటో బోల్తా పడి ఓ మహిళ మృతి చెందగా పలువురికి గాయాలైన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో అదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు చంద్రవ్వ(60) ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఉన్న కోడలిని చూసేందుకు ఆదివారం ధర్మారం నుండి వెళ్ళింది. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి నుండి ఆటోలో రాజన్నపేట గ్రామానికి 12 మంది ప్రయాణికులతో ఆటోలో వెళుతుండగా డ్రైవర్ బత్తుల రవి అజాగ్రత్తగా ఆటోను నడపడంతో రాజన్నపేట శివారులో ఆటో బోల్తా కొట్టింది. దీంతో ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు చంద్రవ్వ అక్కడికక్కడే మృతి చెందగా, రాజన్నపేట కు చెందిన నలినికొండ లావణ్య,నిమ్మపల్లి వజ్రవ్వ లకు తీవ్ర గాయాలయ్యాయి. పలు వురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గాయాలపాలైన క్షతగాత్రులని హాస్పిటల్ కు తరలించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి చంద్రవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా హాస్పిటల్ కి తరలించారు. మృతురాలు కుటుంబం స్థానికంగా చీపుర్లు తయారు చేస్తూ జీవించే నిరుపేద కుటుంబం మృతురాలికి భర్త నర్సయ్య,కుమారుడు పరశురాములు,ముగ్గురు కూతుర్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కొలనూర్ ప్యాక్స్ డైరెక్టర్ పొట్లపల్లి సత్యనారాయణ రావు, గ్రామస్తులు కోరారు.



## కానిస్టేబుల్ పై దాడికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్,రిమాండ్ కు తరలింపు

**సూర్య ముస్తాబాద్**

నామాపూర్ తండాకి చెందిన భూక్యా గురు బాబు అనే వ్యక్తి తన డ్రైవర్ ప్రశాంత్ రామలక్ష్మణ పల్లె గ్రామ శివారులో గల మానేరు వాగు నుండి ఇసుకను దుబ్బాకకు తరలిస్తుండగా నామాపూర్ చెరువు కట్ట మీద పోలీసులు అట్టి ట్రాక్టర్ ను పట్టుకోగా డ్రైవర్ ప్రశాంత్ ఓనర్ బాబుకి ఫోన్ చేయగా బాబు అక్కడికి చేరుకొని మళ్ళీ నా ట్రాక్టర్ ను సీజ్ చేస్తారని,పోలీసుల నుండి ఎలాగైనా తప్పించుకోవాలని డ్రైవర్ ను దింపి బాబు ట్రాక్టర్ తో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ సత్యనారాయణ ను గాయపరిచి బాబు తన డ్రైవర్ ను కార్ లో ఎక్కించుకొని పారిపోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ఈ రోజు మధ్యాహ్నం నామపుర్ గ్రామ శివారులో ముస్తాబాద్ ఎస్సై ఆ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడిపై 21 కేసులు ఒక మర్డర్ కేసు,రౌడీ షీటర్ కేసులు ఉన్నాయని తెలిపారు.



## వైస్ ఎంపిపి కి అంబేద్కర్ సంఘ సభ్యులు సన్మానం.

**సూర్య. ఇల్లంతకుంట.**

ఇల్లంతకుంట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్ గౌడ్ పదవి విరమణ అవుతున్న సందర్భంగా వంతడుపుల గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు ఆదివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల కాలంలో నాకు సహకరించిన ఇల్లంతకుంట మండల ప్రజలకు,అధికారులకు, పాత్రికేయ మిత్రులకు, ఎంపీటీసీ గా గెలిపించిన వంతడుపుల, రహీంఖాన్ పేట గ్రామాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.ఐదు సంవత్సరాలు మీకు సేవ చేసే అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి నేను రుణపడి ఉంటాను అని అన్నారు. సన్మానించిన వంతడుపుల గ్రామ అంబేద్కర్ సంఘం సభ్యులందరికి నా యొక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మడ్కాడి రాములు, ఉపాధ్యక్షులు నల్లగొండ శంకర్, ఏదిరే రాములు,సావనపెల్లి లక్ష్మణ్, బడుగు బాబు, ఎలుక అంజయ్య, చింతకింది వంశీ, రాజయ్య నాయకులు సుదగోని శ్రీనివాస్, కొమ్మర రాజిరెడ్డి, దొమ్మాటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మతల్లీకి బోనమెత్తిన మున్నూరు కాపు సంఘం.

**సూర్య. ఇల్లంతకుంట**

మండల కేంద్రమైన ఇల్లంతకుంట మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లీకి బోనాలు చేశారు.మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్ల మధ్య మహిళ భక్తులు పూనకాలతో ఊగిపోయారు.ఊరేగింపుగా ఆలయం వరకు వెళ్లిన భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ యేడు వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి,పంటలు బాగుండేలా పోచమ్మ తల్లీ చూపు వుండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సీనియర్ సభ్యులు,నాయకులు పాల్గొన్నారు.





# అక్రమ కట్టడాలకు అడ్డా మెట్‌పల్లి మున్సిపల్...

## - అనుమతులు ఓకలా.. నిర్మాణాలు మరోలా - పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు..

**సూర్య మెట్‌పల్లి:-**

మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం కొద్ది రోజుల్లో ముగుస్తుండటంతో కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు అందినకాడికి దోచుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు సైతం అక్రమ నిర్మాణాల్లో వాటాలు పంచుకుంటున్నారు.మున్సిపల్ కేంద్రంలో అక్రమ నిర్మా ణాలు, షెట్ బ్యాక్ లేని నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. బాధ్యత వహించాల్సిన ప్రజాప్రతినిధులే దగ్గరుండి అక్రమ నిర్మా ణాలకు, ఆజ్యం పోస్తున్నారు. మెట్‌పల్లి లో జరిగే అక్రమ నిర్మాణాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అటు జిల్లా అధికారులు కానీ, మండల అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం, నోటీసులు జారీ చేస్తాం అనే సమాధానాలు అధికారుల వైపు నుంచి వినిపిస్తున్నాయే తప్పా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారుల పనితీరు దున్నపోతుపై వర్షం కురిసిన చందంగా ఉందని పట్టణ వాసులు వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్న అధికారులు ప్రభుత్వాదాయానికి గండి కొడుతూ అక్రమ నిర్మాణాదారులు ఇచ్చే సొమ్మును తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నత అధికారులు స్థానిక అధికారులపై చర్యలు తీసుకోకపోతే మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

**అనుమతులు ఒకటి.. నిర్మాణం మరొకటి..**

మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో నిబంధన లకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాల తంతు యథేచ్ఛగా



సాగుతోంది.అనుమతులేమో గృహ నిర్మాణం కోసం తీసుకుని నిర్మాణాలు మాత్రం వారికి నచ్చిన విధంగా (కమర్షియల్) నిర్మిస్తున్నారు. దీనికి మున్సిపల్ అధికారులు తోడుకావడంతో పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. గృహనిర్మాణం కోసం అనుమతులు తీసుకుంటూ వ్యాపార సముదాయాలను నిర్మిస్తున్నా.. ఉన్నతాధికారులు వీటిపై దృష్టి పెట్టకపోవడంతో కిందిస్థాయి అధికారులు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా వ్యవహారం జరుగుతోంది. టీఎస్బీ పాస్ ద్వారా ఏ నిర్మాణం చేపట్టాలన్నా దరఖాస్తులు చేసుకుంటే అధికారులు పర్యవేక్షణ చేసి అనుమతులు ఇస్తారు. కానీ దరఖాస్తు ఏమో గృహ నిర్మాణం కోసం, నిర్మాణం ఏమో వాణిజ్య అవసరాల కోసం చేస్తున్నారు.తనిఖీ చేయాల్సిన టాస్కోఫర్స్ బృందాలు మాత్రం ఏమిపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. పట్టణ శివారులో ఓ వ్యక్తి శివారులో జాతీయ రహదారి ఆనుకొని ఓ బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టాడు. ఆ నిర్మాణానికి ఒక స్టిల్ట్ ప్లస్ 3 ఫ్లోర్స్ కు పర్మిషన్ తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా మూడు ఫ్లోర్ లు నిర్మించి పెంట్ హౌస్ నిర్మాణం చేపట్టాడు. పార్కింగ్ కోసం సెల్లార్ వదిలిపెట్టాల్సి ఉన్న అదేమీ పట్టించుకోకుండా సెల్లార్ స్థలంలో గదుల నిర్మాణం చేపట్టాడు. ఆ పనులు పూర్తయిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడలేదు. టీచర్స్ కాలని లో ఓ మేస్త్రి సెట్ బ్యాక్ లేకుండా మూడు ఇండ్లు కట్టిన స్థానికులు పిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. 8వ వార్డులో ఓ మేస్త్రి డ్రైనేజ్ పై ఇండ్లు కడుతున్న అదే వార్డులో మరో ఇద్దరు పాత బిల్డింగ్ ల పై నిర్మాణం చేపట్టిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. అయితే వీటన్నిటికీ కొందరు ప్రతిపక్ష, అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని ప్రజలు అంటున్నారు.

**కానరాని టౌన్ ప్లానింగ్ అధికారులు..**

మెట్‌పల్లి మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా కమిషనర్ ఆధీనంలో ఉండే టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం అనేక సందేహాలకు ఊతమిస్తుంది. సామాన్యుల వద్ద ముక్కు పిండి పన్నులు వసూలు చేసే అధికారులు అక్రమ నిర్మాణాలను ఉపేక్షించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో డిప్యూటేషన్ పై విధులు నిర్వర్తిస్తున్నా టిపిఎస్ వేములవాడ మున్సిపల్ కు బదిలీపై వెళ్లగా, టిపిఓ మూడు రోజులు ఇక్కడి మున్సిపల్ లో మరో మూడు రోజులు వేరే చోట విధులు నిర్వహిస్తాడు. టిపిఓ విధులకు హాజరైన మూడు రోజులు అక్రమ నిర్మాణాలపై ఎవరు పిర్యాదు చేసిన తనకు తెలువదని కమిషనర్ ను అడగాలని సమాధానం చెబుతాడని ప్రజలు చర్చించుకుంటున్నారు.అసలు పట్టణ మున్సిపల్ లో టౌన్ ప్లానింగ్ విభాగం ఉందా లేదా అనే సందేహం కలిగేలా ఆ విభాగం పని తీరు ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



# ముళ్ళ పొదలను తొలగించండి....!

## -మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు కరువు..?

## -పట్టించుకోని అధికారులు...!

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండల పరిధిలోని పలు రహదారులకు ఇరువైపులా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు గడ్డి, భారీగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా గంభీరావుపేట -నర్మాల వెళ్లే ప్రధాన రహదారి (గంగమ్మ గుడి) వెంకటాద్రి చెరువు కట్ట కింద నుండి నర్మాలకు వెళ్లే దారి ముళ్ళ పొదలు పిచ్చిమొక్కలు గడ్డితో కమ్ముకుని ఇరుకుగా మారింది. మండల కేంద్రానికి నిత్యవసరాల కోసం నర్మాల దేశాయిపేట కోల్లమద్ది తదితర గ్రామాల ప్రజలు వాహనాలతో పాటు వ్యవసాయ పనులకు వచ్చి పోయే రైతులు యంత్రాలు వివిధ పనుల నిమిత్తం అటుగా వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పై ప్రభుత్వ అధికారుల దృష్టి సారించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన రహదారుల వెంట పెరిగిన ముళ్ల పొదలను, గడ్డిని తొలగించి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



# నూతన పవర్ ప్లాంట్ ఏర్పాటు పై రాజకీయ దుమారం

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం బి-థర్మల్ పవర్ స్టేషన్‌ను తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎస్ జెన్‌కో) నిర్వహిస్తోందనే విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ఈ పవర్ స్టేషన్ ను మార్చి 31, 2019న



మూసివేయడానికి సిద్ధం అయినప్పటికీ కొన్ని కారణాలవల్ల రాష్ట్ర ప్రభుత్వం మూసివేతను వాయిదా వేస్తూ వస్తోంది. అయితే ఇటీవల ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది ఇంజనీర్లను ఇతర యూనిట్ లకు డిప్యూటేషన్ పై పంపించేందుకు ప్రయత్నం చేసినప్పటికీ మళ్ళీ ఆ ఆర్డర్ ను కొన్ని కారణాలవల్ల యాజమాన్యం వెనక్కి తీసుకున్నట్లు తెలు స్తోంది. ఎలాగైనా ఈ ప్లాంట్ ను మూసివేయాలనే ఆలోచ నలో జెన్‌కో ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అయితే సింగరేణి ఆధ్వర్యంలో నూతన పవర్ ప్లాంట్ చేప ట్టాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా, స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సైతం సింగరేణి ఆధ్వర్యంలో పవర్ ప్లాంట్ ఏర్పా టుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా బి-థర్మల్ పవర్ స్టేషన్ లో ఈనెల 4వ తేదీ నుండి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. కోల్ మిల్స్ లో ఏర్పాటైన సాంకేతిక లోపం ద్వారా తాత్కాలికంగా ఉత్పత్తి ఆగిపోగా, యాజమాన్యం తిరిగి ఉత్పత్తి ప్రారంభించేందుకు వెనుకంజ వేయడంలో అసలు విషయం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కేవలం రూ.50 లక్షల రూ. 2 కోట్ల పెట్టుబడితో పవర్ స్టేషన్ ను తిరిగి ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ, ఆ దిశగా యాజమాన్యం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. పొల్యూషన్ నియంత్రణ కోసం చర్యలు ఇదివరకే జరగడం, 2014లో పునర్నిర్మాణం, ఆధునీకరణ పనులు చేపట్టిన యాజమాన్యం ఐదేళ్లకు ఒకసారి పునర్నిర్మాణ, ఆధునీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. కానీ పదేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు యాజమాన్యం ఆ పనులు చేపట్టకపోవడంతో తరచూ ప్లాంట్ లో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయి. ఏలాగైనా బి-స్టేషన్ ను మూసివేయాలనే ఆలోచనలో జెన్‌కో ఉన్నతాధికారులు ఉన్నట్లు పలు వురు ఆరోపిస్తున్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నూతన పవర్ ప్లాంటును బి-స్టేషన్ స్థానంలో ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు భారీగా నష్టం చేకూరే ప్రమాదం ఉంది. సింగరేణి ఆధ్వర్యంలోని జైపూర్ పవర్ ప్లాంట్ నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో చాలామందికి తెలియదు. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగుల విషయానికి వస్తే ఎన్టీపీసీ ఇతర పవర్ సెక్టార్ లలో పనిచేసి రిటైర్డ్ అయిన ఇంజనీర్లు, ఇంజనీరింగ్, డిప్లమా చేసిన విద్యార్థులను క్యాజువల్ లేబర్ గా తీసుకుని రోజుకు రూ.760 జీతం ఇవ్వడం జరుగుతుంది. రామగుండంలో కూడా సింగరేణి ఆధ్వర్యంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు జరిగితే ఉద్యోగ అవకాశాలు ఏ విధంగా ఉంటాయో జైపూర్ ప్లాంట్ పరిస్థితులను చూస్తే తేటతెల్లమవుతుంది. జెన్‌కో ఆధ్వర్యంలోనే పవర్ ప్లాంట్ పునర్నిర్మాణం జరిగితే 100 నుండి 200 మంది ఇంజనీర్లకు పర్మినెంట్ ఉద్యోగ అవకాశాలతో పాటు 500 మందికి పైగా క్రింది స్థాయి పర్మినెంట్ ఉద్యోగాలు, దాదాపు 1000 మంది వరకు కాంట్రాక్ట్ లేబర్ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడున్న రామగుండం బి-స్టేషన్ ను పూర్తిస్థాయిలో ఆధునికరించి విద్యుత్ ఉత్పత్తి చేపడితే రాష్ట్రంలోనే అతి తక్కువ రేటుకు విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ గా బి-స్టేషన్ ఉంటుందని పలువురు సీనియర్ ఇంజనీర్లు చెపుతున్నారు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. సింగరేణి ఆధ్వర్యంలో నూతన పవర్ ప్లాంట్ చేపడితే జెన్‌కో కు సంబంధించిన విలువైన భూములను ఏదో ఒక విధంగా నొక్కేయాలని ఆలోచనలో కొంతమంది నాయకులు ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరగడం కొసమెరుపు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి..

# తల్లి పేరిట ఓ మొక్క నాటండి..

## - తిమ్మాపూర్ మండలంలో ప్రధాని మన్‌కి బాత్ వీక్షణ అనంతరం కేంద్రమంత్రి బండి సంజయ్ ...

**సూర్య తిమ్మాపూర్**

భారత ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ సందర్భంగా పర్యావరణం, మొక్కలు నాటడంపై ప్రధానంగా మాట్లాడారని, తల్లికి ఉన్న అత్యున్నత స్థానాన్ని గొప్పగా వివరించారని , అమ్మ పేరు మీద ఓ చెట్టు నాటాలని ప్రధాని పిలుపనిచ్చిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తల్లి పేరిట ఓ మొక్క నాటాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రోజున కేంద్రమంత్రి బండి సంజయ్ తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని స్థానిక నివాసి నోముల వీరేశం ఇంట్లో వీక్షించారు. మన్ కీ బాత్ ప్రోగ్రాంను ఉద్దేశించి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోడీ మన్ కీ బాత్ లో మాట్లాడారని, మోడీ 3.0 లో ఇది111వ తొలి మన్ కి బాత్ అన్నారు. దాదాపు నాలుగు నెలల అనంతరం ఈ కార్యక్రమం ద్వారా జాతిని ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారని, ఇందులో పలు కీలక అంశాల్ని ప్రధాని ప్రస్తావించారన్నారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంబంధం పర్యావరణానికి ఉందని, పేద ధనిక అనే తేడా లేకుండా పర్యా వరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యతను ప్రధాని మోదీ గుర్తు చేశారని, అందుకోసమే తల్లి పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయనపిలుపునిచ్చార న్నారు. యోగ దినోత్సవ ప్రాముఖ్యత గురించి ప్రధాని మోదీ అనేక విషయాలను తెలియ జేశారన్నారు.



అలాగే కేరళ లో తయారవుతున్న ప్రత్యేకమైన గొడుగుల గురించి ప్రస్తావించారని, కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అనేక సాంప్రదాయాలు ఆచారాలలో గొడుగులు ఒక ముఖ్య భాగం అని, ఇలాంటి గొడుగులను గిరిజన సోదరీమణులు తయారు చేస్తారని, దేశవ్యాప్తంగా ఈ గొడుగు లకు మంచి డిమాండ్ ఉందనే విషయాన్ని ప్రధాని మోడీ ఈ సందర్భంగా తెలియ జేశారన్నారు. ఆల్ ఇండియా రేడియో సంస్కృత బుల్ టెన్ జూన్ 30 వ తేదీతో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారని, అలాగే జూన్ 30వ తేదీ గిరిజన సోదర సోదరీ మణులకు ముఖ్య మైన రోజు అని ఆరోజును హాలిడేగా జరుపు కుంటారని , ఆరోజు ప్రత్యేకత గురించి ప్రధాని మోడీ సమగ్ర సమాచారాన్ని తెలియ జేశార న్నారు. టి20 ప్రపంచ కప్ చారిత్రక విజయంపై ప్రధాని మోదీ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారని , టోక్యో ఒలంపిక్స్ లో దేశ క్రీడాకారుల ప్రదర్శన ప్రతి భారతీయుడి హృద యాన్ని గెలుచుకున్న విషయాన్ని మోడీ ఈ సందర్భంగా ప్రస్తావి ంచారన్నారు.

# కేటీఆర్ అనుచరులకు అప్పనంగా పంచిపెట్టిన ప్రభుత్వ భూమి

## - కేకే మహేందర్ రెడ్డి

**సూర్య సిరిసిల్ల టౌన్**




ఎమ్మెల్యే కేటీఆర్ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వానికి ఉత్తరాలు వాట్సాప్ మెసేజ్ లకే పరిమితమయ్యారని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆరోపించారు.సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని అనర్హులకు అప్పనంగా పంచిపెట్టిన ఘనత కేటీఆర్ దక్కుతుందని,సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన భూకుంభకోణాన్ని పూర్తి ఆధారాలతో బయట పెడతానని అన్నారు.బతుకమ్మ చీరల పేరిట నేతన్నల బతుకులు ఆగం చేసిన ఘనత కేటీఆర్ దే,రాష్ట్రాన్ని 7లక్షల కోట్ల అప్పు ఊబిలోకి దింపిన చరిత్ర బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉత్తరాలు రాయడం, ట్విట్టర్ మెసేజ్ లు,వాట్సప్ లో షేర్ చెయ్యడానికే పరిమితమయ్యారని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత కేటీఆర్ కుటుంబం పంచ భూతాలను సైతం వదల్లేదని, సిరిసిల్ల నియోజకవర్గంలో అనర్హులకు, అనుచరులకు ప్రభుత్వ భూమిని అప్పనంగా పంచిపెట్టారని తెలిపారు.సిరిసిల్లలో నేతన్నల చావులన్నీ ప్రభుత్వ హత్యలే అంటున్న కేటీఆర్,ఈ హత్యలకు మూల కారకుడివి మీరు కాదా అని ప్రశ్నించిన కేకే.రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన 7లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం మిత్తి కట్టుకుంటూ వస్తున్నామని దుయ్యబట్టారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరల పేరిట కేటీఆర్ పెట్టిన బకాయిలో 110కోట్లు చెల్లించమని తెలిపారు. వైస్సార్ హయాంలో నేతన్నలకు విద్యుత్ సబ్సిడీ ఇస్తే టిఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నల విద్యుత్ బకాయిలను చెల్లించలేదని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఆత్మహత్యలు,ఈ ప్రభుత్వంలో జరగలేదని,మా ప్రభుత్వం వచ్చిన తరువాత మానవ హక్కులకు,పత్రిక రంగానికి స్వేచ్ఛ వచ్చాయని పేర్కొన్నారు.అదేవిధంగా తంగళ్ళపల్లి మండలం బద్దన్నపెల్లిలో సర్వే నెంబర్ 555లో 236 మందికి ఇష్ట రాజ్యంగా ప్రభుత్వ భూమిని పంచి పెట్టి,అర్హులకు అన్యాయం చేసారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కులు వైద్య శివప్రసాద్,గడ్డం నర్సయ్య, తంగళ్లపల్లి మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్, ఎంపీటీసీ బైరినేని రాము, పాల్గొన్నారు.

# అధికారులు అంకితభావంతో పనిచేయాలి

## - సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ అదిశ్రీనివాస్

**సూర్య చందుర్తి 02**



ప్రజా పాలన ప్రభుత్వములో అధికారులు అంకితభావంతో పనిచేయాలని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు చందుర్తి మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం రోజున జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఫిబ్రవరి మాసంలో సర్పంచుల పదవీకాలం ముగియగా జూలై ఈ మాసంలో నాలుగున ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుందని అధికారులపై మరింత భారం పెరగనుందని అధికారులు ప్రజలలో మమేకమై ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అంకితభావంతో పనిచేయాలని అన్నారు సర్వసభ్య సమావేశంలో ప్రాదేశిక సభ్యులు అధికారులు సమర్పించిన నివేదికలపై అధికారులను నిలదీయగా పొంతన లేని సమాధానాలు తూ తూ మంత్రంగా నివేదికలు సమర్పించారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు బండ పెల్లి ఎంపిటిసి రణధీర్ రెడ్డి మిషన్ భగీరథ నీటి సరఫరా గ్రామాలలోని నీటి సరఫరా గురించి సంబంధిత అధికారులను వాటికి సంబంధించిన నివేదికల గురించి అడగగా నివేదికకు మౌఖికంగా ఇచ్చిన సమాధానానికి పొంతన లేకుండా పోవడంతో స్పందించిన ఎమ్మెల్యే సరియైన నివేదికలతో సమావేశంలో సమర్పించాలని అధికారుల ఆదేశించారు వర్షాకాలము కావడంతో పల్లెలలో ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని మరిగడ్డ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సబ్ సెంటర్ ను ఏర్పాటు చేసినప్పటికీ వైద్య సదుపాయాలు అందుబాటులో లేవని మరిగడ్డ ఎంపీటీసీ కావ్య అధికారుల నిలదీయగా అదేవిధంగా జోగాపురం ఎంపీటీసీ గణేష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండలేరని ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వచ్చి సిబ్బంది లేక తిరిగి ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించవలసిన అవసరం వస్తుందని మండల వైద్యాధికారిని వారు నిలదీయగా సరియైన సమాధానం లేకపోయింది చందుర్తి మండల కేంద్రంలోని స్థానిక కాపుల గుట్ట ఆవరణలో నిర్మించ తలపెట్టిన శ్రీ శక్తి భవనం నిర్మాణం పూర్తికాక శిథిలావస్థలోకి చేరుకుందని పత్రికలద్వారా భవనంపై ఎన్నో ఆరోపణలు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరైన పద్ధతి కాదని పలువురు సభ్యులు నిలదీయగా దానిపై స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులను భవన నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకుని వెంటనే పనులు ప్రారంభించి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని భవనానికి అదనంగా నిధులు అవసరమైతే ప్రభుత్వం ద్వారా తమ వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు అనంతరం పదవి కాలం ముగుస్తున్న ఎంపీటీసీలను ఆయన అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా చైర్పర్సన్ నేలకొండ అరుణ రాఘవరెడ్డి ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్ జడ్పిటిసి నాగం కుమార్ సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్ సింగిల్ విండో చైర్మన్ జలగం కిషన్ రావు సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు మండలంలోని అన్ని శాఖల అధికారులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ మిషన్ గడువును పెంచినందుకు కేంద్ర ప్రభుత్వంకు ధన్యవాదాలు

## - నగర మేయర్ యాదగిరి సునీల్ రావు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

స్మార్ట్ సిటీ మిషన్ గడువును పెంచిన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, కరీంనగర్ జిల్లా ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి నగర మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.స్మార్ట్ సిటీ మిషన్ జూన్ 30 వ తేదితో ముగుస్తుండటంతో 2025 మార్చి వరకు గడవును కేంద్ర ప్రభుత్వం పొడగించడం దరిగిందన్నారు. పెంచిన గడువును పూర్తి స్థాయిలో స్వాగతిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో స్మార్ట్ సిటీ మిషన్ ప్రారంభం చేయడం చాలా సంతోషకరం అన్నారు. పెంచిన గడువు వల్ల కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ లో ప్రజలకు అన్ని రకాస సదుపాయలు సమకూరుతాయని తెలిపారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ ప్రాజెక్టులో చేపట్టి అభివృద్ధి పనులు దాదాపు 80 శాతం పూర్తై ప్రజలకు సౌకర్యకరంగా ఉన్నాయని తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేసిన అభివృద్ధి కార్యక్రమాలతో ఇప్పటికే నగర రూపు రేఖలు మారాయని... ఒక సుంధరమైన నగరంగా కరీంనగర్ పేరు సంపాదించిదని తెలిపారు. పొడగించిన గడువులో మిగితా 20 శాతం పనులు మా పాలకవర్గం పూర్తి చేసి... పూర్తి స్థాయిలో కరీంనగర్ నగరాన్ని ఇంకా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో నగర ప్రజలకు అన్ని రకాలుగా వసతులు, సౌకర్యాలు సమకూరుతాయని తెలిపారు. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు కరీంనగర్ పార్లమెంటు సభ్యుని హోదాలో ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయడంలో కృషి చేసిన బండి సంజయ్ గారు.. పొడగించిన స్మార్ట్ సిటీ మిషన్ గడువులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గా నగర అభివృద్ధి కోసం బండి సంజయ్ గారు మరిన్ని నిధులు తీసుకరావడంలో పూర్తి సహకారం అందించాలని కోరుతున్నట్లు తెలిపారు.

### తెలంగాణ ముదిరాజ్ యువత విభాగం ఉపాధ్యక్షుడిగా గడీల

**సూర్య - కథలాపూర్**



తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన రాష్ట్ర విభాగం ఉపాధ్య క్షుడిగా తాండ్రియాల గ్రామానికీ చెందిన మాజీ సర్పంచ్ గడీల గంగా ప్రసాద్ ను నియ మించారు. రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బండ ప్రకాష్ ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు పండగ బాలు ముదిరాజ్ లు ఆది వారం గంగప్రసాద్ కు నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ యువత ను ఐక్యం చేస్తు జాతి అభ్యున్నతికి, పురోగతి, సంక్షేమానికి, సామాజిక, ఆర్థిక రాజకీయ సంస్కృతిక పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు.నూతనంగా నియమకమైన గంగా ప్రసాద్ ను మండల ముదిరాజ్ కులస్తులు శుభాకాంక్షలు తెలిపారు.



### వెలమ సంక్షేమ మండలి సర్వసభ్య సమావేశం

**సూర్య సిరిసిల్ల టౌన్**

సభ్యుల సంక్షేమం కోసం,సంఘం అభివృద్ధి కోసం పాలకవర్గం కృతనిచ్చేయంతో పనిచేస్తుందని, రానున్న రోజుల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు సిరిసిల్ల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల రామారావు వెల్లడించారు.సిరిసిల్ల జిల్లా వెలమ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం చిక్కాల రామారావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ప్రగతి నివేదికను సభ్యుల ముందు పెట్టారు.అనంతరం సభ్యుల సలహాలు సూచనలు స్వీకరించారు. రానున్న రోజుల్లో సంక్షేమ సంఘం చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలను చైర్మన్ చిక్కాల రామారావు సభ దృష్టికి తీసుకురాగా వారంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.వారు మాట్లాడుతూ ఎలాంటి లాబాపేక్ష లేకుండా సంఘాన్ని అభివృద్ధి బాటలో పయనింప చేస్తున్నామని,నిరుపేద వెలమల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.విద్యా నిధి నుండి నిరుపేద విద్యార్థినిలకు 40 వేల రూపాయల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.ఇప్పటివరకు సంక్షేమ సంఘం తరపున రెండు బిల్డింగ్ ల నిర్మాణం పూర్తి చేశామని,రానున్న రోజుల్లో మరో బిల్డింగ్ నిర్మాణం చేపడతామన్నారు.త్వరలో రిక్రియేషన్ క్లబ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిక్కాల రామారావు వెల్లడించారు. జిల్లా వెలమ సంక్షేమ మండలి కాలపరిమితిని సంవత్సరం పాటు పొడిగిస్తూ ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు.ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుజ్జునేని వేణుగోపాలరావు,ఉపాధ్యక్షులు సురభి దశరథ రావు,చీటీ నరసింహారావు,బాలన్నగారి మేఘమాల,కోశాధికారి బొంత వేణుగోపాలరావు, సంయుక్త కార్యదర్శి అనిల్ రావు,కిరణ్ రావు, జూపల్లి శ్రీలత,పాపారావు,కార్యవర్గ సభ్యులు వెంకట్రావు,ప్రదీప్ కుమార్,సందీప్ రావు,భూపతి రావు,చీటీ గీత,వెంకటేశ్వరరావు,నాగేశ్వరరావు, జ్యోతిరాణి,బాలకిషన్ రావు,హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

### సిపి వద్దకు కిరాణా వర్తక సంఘ వివాదం

**సూర్య, హుజురాబాద్:**

గత రెండేళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న హుజురాబాద్ కిరాణా వర్తక సంఘం వివాదం పరిష్కారం కోసం వర్తక సంఘం నాయకులు ఇటీవల సిపి అభిషేక్ మహంతిని ఆశ్రయించినట్లు తెలిసింది. హుజురాబాద్ కిరాణా వర్తక సంఘం లో డబ్బుల వ్యవహార వివాదం ఇంకా కొనసాగుతుంది. గతంలో సంఘం అధ్యక్షునిగా పనిచేసిన చందా గాంధీ.. తదనంతరం వచ్చిన కొత్త కమిటీకి లెక్కలు చూపించడం లేదని ఆరోపిస్తూ నూతన అధ్యక్షుడు శీల రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కిరాణా వర్తక సంఘానికి సంబంధించిన షెట్టర్ల కిరాయితోపాటు, ఇతర నిధులు రూ.9 లక్షలు గత అధ్యక్షులు చందా గాంధీ వద్ద ఉన్నాయని ఈ విషయమై ఆయన లెక్కలు చూపడం లేదని , 2023 ఫిబ్రవరిలో ఈ విషయమై హుజరాబాద్ సిఐ కి ఫిర్యాదు చేయడం జరిగిందని, రాజకీయ ఒత్తిళ్లతో సంఘానికి రావలసిన డబ్బులు ఇవ్వలేదని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని, సంఘానికి రావలసిన డబ్బులు ఇప్పించాలని . ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా ఈ విషయమై చర్యలు తీసుకోవాలని సిపి హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జిని ఆదేశించినట్లు తెలుస్తోంది. కాగా సిపి ఆదేశాలతో ఇరువర్గాలను పిలిచి విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. వర్తక సంగం వివాదం పరిష్కారం కోసం పోలీస్ బాస్ వద్దకు వెళ్లడంతో హుజురాబాద్ లో పెద్ద చర్చనీయాంశం గా మారింది.